సాక్షి తిరుపతి
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



ఎంపీపీ బాధ్యతల స్వీకరణ
తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ప్రమాణస్వీకార మహోత్సవం అట్టహాసంగా సాగింది. - 8లో



తవ్వుకో.. తరలించుకో!
గూడూరు నియోజకవర్గంలో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. విలువైన క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించేస్తున్నారు. - 8లో



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా
తమను రెగ్యులర్ చేయాలంటూ ఏపీఎస్పీడీసీఎల్ కాంట్రాక్ట్ కార్మికులు మహాధర్నా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

బలవంతపు భూసేకరణ ఆపండి


మాట్లాడుతున్న రైతులు

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం(రాచపాళెం), రాళ్లకుప్పం గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని ఆయా గ్రామాల రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన వంద మంది రైతులు కలసి ఇరుగుళంలో సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీసిటీ ఏర్పాటు చేసిన తొలి దశలో ఏపీఐఐసీకి సేకరించిన భూములలో ఇంకా 40 శాతం భూమి ఖాళీగానే ఉందన్నారు. ఆ భూమిని వదిలేసి మళ్లీ భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. నాలుగు గ్రామాల్లో ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు రైతులందరూ తీర్మానం చేసినట్టు వెల్లడించారు. మండల పరిధిలో ఏపీఐఐసీకి నాలుగు గ్రామాల్లో 2,583.99 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీచేయగా.. ఇందులో రైతుల పట్టా భూమి 1,753.060, ప్రభుత్వ భూమి 830.239 ఎకరాలు ఉన్నట్లు సమాచారం.

పోలీస్ గ్రీవెన్స్‌కు 121 అర్జీలు


ఏఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 121 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

12న తుంబురుతీర్థ ముక్కోటి
తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరంలో వెలసి ఉన్న శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం ఈనెల 12న జరగనుంది. ప్రకృతి సౌందర్యాల నడుమ నిర్వహించే ఈ ముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం ఒక ప్రత్యేక అనుభూతిగా భక్తులు భావిస్తారు. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

టీటీడీకి రూ.30 లక్షల విరాళం
తిరుమల: బెంగళూరుకు చెందిన బీఎంకే నగేష్ అనే భక్తుడు సోమవారం ఎస్వీ సర్వ శ్రేయస్ ట్రస్టుకు రూ.30 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలో అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరికి టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా విరాళం డీడీని అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,960 మంది స్వామివారిని దర్శించుకోగా 23,126 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శిలాతోరణం సమీపంలో పాము కలకలం



తిరుమల : శిలాతోరణం సమీపంలో తొమ్మిది అడుగుల జెర్రిపోతు పాము కలకలం సృష్టించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు చాకచక్యంగా దాన్ని పట్టుకుని అవ్వాచారి కోనలో విడిపెట్టారు.

'పులికాట్ సరస్సును సంరక్షిస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే సముద్ర ముఖద్వారాల వద్ద పూడిక తీత పనులు ప్రారంభిస్తాం. మత్స్యకారులకు అండగా నిలుస్తాం. విదేశీ విహంగాలకు తోడ్పాటు అందిస్తాం' అంటూ ప్రగల్భాలు పలకడం.. ఆపై మిన్నకుండిపోవడం టీడీపీకి అలవాటుగా మారింది. గత ఎన్నికల్లోనూ ఇదేమాదిరిగా కూటమి నేతలు మాట ఇచ్చి నేటికీ నెరవేర్చకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పూడిపోయిన సముద్ర ముఖద్వారం (ఫైల్)


రాయదొరువు ఉప్పటేరు కాలువకు అడ్డంగా ఇసుక మేట

మేటలే ఇక!

- పులికాట్ సరస్సు సంరక్షణ గాలికి
- ముందుకు సాగని సముద్రముఖద్వారాల పూడికతీత పనులు
- సర్వేలతోనే కాలం నెట్టుకొస్తున్న నేతలు
- అబద్ధాలతో మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం
- పెదవి విరుస్తున్న మత్స్యకారులు, పర్యావరణ వేత్తలు

సూళ్లూరుపేట: ఆంధ్రా–తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన పులికాట్ సరస్సు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. బంగాళాఖాతం ముఖద్వారాల వద్ద పూడిక పేరుకుపోవడంతో ఉప్పు నీటిరాక మందగించింది. విదేశీ విహంగాలతోపాటు మత్స్యకారులకు ఇది గుదిబండగా మారింది.

జీవ వైవిధ్య సరస్సు

ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల్లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, తిరువళ్లూరు జిల్లాల పరిధిలో సుమారు 620 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులికాట్ సరస్సు విస్తరించి ఉంది. ఇందులో 500 చదరపు కిలోమీటర్లు ఆంధ్రరాష్ట్రం పరిధిలోని నెల్లూరు జిల్లా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వాకాడు, చిట్టమూరు మండలాల్లో విస్తరించి ఉంది. మిగిలిన 120 చదరపు కిలో మీటర్లు తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి, పొన్నేరి తాలుకా పరిధిలో విస్తరించి ఉంది. జీవవైవిధ్యాన్ని సంతరించుకున్న రెండో అతిపెద్ద ఉప్పునీటి సరస్సుగా గుర్తింపు పొందింది. ప్రతిఏటా వేసవికి ముందే సముద్ర ముఖద్వారాలకు అడ్డుగా ఇసుక మేటలు పేరుకుపోయి సరస్సు ఎడారిలా మారిపోతోంది. బంగాళాఖాతం నుంచి తమిళనాడు పరిధిలోని పలవేరికాడ్ వద్ద ఒక ముఖద్వారం, మన రాష్ట్రంలో రాయదొరువు వద్ద మరొక ముఖద్వారం ఉంది. వర్షాకాలంలో స్వర్ణముఖి, కాళంగినదితో పాటు చిన్నాచితక కాలువల నుంచి మంచినీరు సరస్సుకు చేరుతుంది. సముద్రంలో ఆటుపోట్లు వచ్చి అలల ఉధృతి పెరిగినపుడు అందులో నుంచి ఉప్పునీరు పులికాట్‌లోకి ప్రవేశిస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలసిన సంగమం కాబట్టి దీన్ని జీవవైవిధ్యం కలిగిన సరస్సుగా పర్యావరణ వేత్తలు గుర్తించారు.

రామ్‌సర్ సైట్ ఒక్కటే మార్గం

పులికాట్ సరస్సు చిత్తడి నేలల సరస్సు. ఇరాన్ కేంద్రంగా నడుస్తున్న రామ్‌సర్ సైట్‌లోకి దీన్ని చేర్చితే పులికాట్ సరస్సుకు పూర్వ వైభవం రావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలా చేయాలంటే ముందుగా శాసనసభలో బిల్లు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. ఆపై దీన్ని ఆమోదించేవరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. తద్వారా పులికాట్ సరస్సును అభివృద్ధి చేయొచ్చని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

పోరాడుతున్న ఎంపీ

పులికాట్ సరస్సు సంరక్షణకు వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అవిరాళంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. నిధులు మంజూరు చేయించాలని అభ్యర్థించారు. ఆమేరకు ఒత్తిడి తెస్తున్నా చలనం లేకుండా పోతోంది.

ఫ్చ్..ఫలితం లేదు!

దాదాపు 20 ఏళ్లుగా ఎంతో మంది ఎంపీలు.. నేతలు మాట ఇచ్చి చేతులు ముడుచుకుంటున్నారు తప్ప పులికాట్ సంరక్షణకు ఏమాత్రం సహకరించడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అవే అబద్ధాలు..ఎన్నో మోసాలు



టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా సముద్ర ముఖద్వారాల పూడికతీత సమస్యను తెరమీదకు తెచ్చి మత్స్యకారులను మోసం చేయడం అలవాటుగా మారిపోయింది. 1994–2004, 2014–19 సంవత్సరాల్లో ఇదేమాదిరిగా మాట ఇచ్చి నిలబెట్టుకోలేక పోయింది. ఇప్పుడేమో సాగరమాల ప్రాజెక్టు ద్వారా రూ.129 కోట్లతో పూడిక తీత పనులు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తోంది. సర్వేలు జరుగుతున్నాయని, నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని బురిడీ కొట్టిస్తోంది.

నేతల ఒత్తిడితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం సర్వేలకే పరిమితమవుతున్నాయి. గత యేడు జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్స్‌లోనూ సముద్ర ముఖద్వారాల పూడిక తీత విషయాన్ని నేతలు ప్రముఖంగా ప్రస్తావించి మిన్నకుండిపోయారు.


వర్షాలప్పుడు తొణికిసలాడుతున్న పులికాట్ సరస్సు (ఫైల్)


వేసవిలో వట్టిపోయిన పులికాట్ సరస్సు


వర్షాకాలంలో ఇలా.. (పాతచిత్రం)


వేసవికాలంలో ఎండిపోయి నెర్రెలు బారిన పులికాట్ సరస్సు

ప్రతి అర్జీకి పరిష్కారం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే ప్రతి అర్జీకి అధికారులు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యధికంగా 480 అర్జీలు వచ్చాయి. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు హాజరై అర్జీలు స్వీకరించారు. అర్జీదారులకు రసీదులు ఇవ్వాల్సిన కౌంటర్ వద్ద రద్దీ నెలకొంది.


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ

మురుగును శుభ్రం చేయండి



నేను దివ్యాంగుడిని. తనపల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నా. మా కాలనీ చుట్టూ, కాలనీ వద్ద మురుగునీటితో నానా తంటాలు పడుతున్నాం. రెండు సార్లు నేను మురుగునీటిలో జారిపడ్డాను. దోమల బెడద అధికంగా ఉంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– విజయభాస్కర్, తనపల్లి, తిరుపతి రూరల్ మండలం

న్యాయం చేయండి


అడ్డూరు రమణమ్మ, వేణి దంపతులతో బీఎల్ శేఖర్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు చెందిన బెనిఫిట్స్ ఇవ్వాలని గూడూరు రూరల్ మండలం, చెన్నూరు పాత గిరిజన కాలనీకి చెందిన అడ్డూరు రమణమ్మ, ఆమె భర్త వేణు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు విచ్చేసి అర్జీని అందించారు. వారికి మద్దతుగా గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బీఎల్ శేఖర్ నిలిచారు.

నేటి నుంచి పోషణ్ పఖ్వాడా


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7వ పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోషణ్ అభియాన్‌లో భాగమైన పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహార స్వీకరణ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

64 మందిలో 48 మందికే పింఛన్

సత్యవేడు: మండలంలోని సత్యవేడు పంచాయతీ వీఆర్‌ఓ 64 మందికికి గాను 48 మందికే పింఛన్లు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు 1వ సచివాలయ పరిధిలోని వీఆర్‌ఓగా పనిచేస్తున్న చిట్టిబాబుకు ఏప్రిల్ పింఛన్‌ను 64 మందికి అందజేసేందుకు రూ.2.68 లక్షలు తీసుకున్నారు. ఏప్రిల్ 1న 48 మందికి పింఛన్ రూ.2.2 లక్షలు పంపిణీ చేశారు. ఆ తర్వాత బంధువులకు ఆరోగ్యం బాగోలేదని చెప్పి వెళ్లాడు. వారం రోజులైనా ఆయన జాడ లేదు. దీంతో సత్యవేడు సెక్రటరీ మునిరవికుమార్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో లబ్ధిదారులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కౌన్సిలర్లను బెదిరిస్తున్నారు


గూడూరు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు నేదురుమల్లి, మేరిగ మురళీధర్


చిల్లకూరు : వెంకటగిరి మున్సిపాలిటీలోని 25 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లలో ఆరుగురిని తమ వైపునకు తిప్పుకుని మిగిలిన వారిని బెదిరించి అవిశ్వాస తీర్మానంలో విజయం సాధించాలని కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చూడాలని కోరారు. కూటమి నేతలు కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి తమకు మద్దతు ఇవ్వాలని బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కేసులు ఉన్నాయని, వాటిని తిరగదోడి ఇబ్బందులు పెడతామని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఎవరూ ప్రలోభాలకు లొంగకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి కూటమి నేతల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. అవిశ్వాసంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

కౌన్సిలర్లకు విప్ జారీ

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీలో ఈనెల 9న జరగనున్న అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కౌన్సిలర్ల విప్ జారీ చేసినట్టు నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు విప్ నివేదికలను గూడూరు సబ్‌కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ రాఘవేంద్రమీనన్‌కు కూడా అందజేసినట్టు వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేసేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోందన్నారు.

ఆగిన ఆరోగ్యశ్రీ

- జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన సేవలు
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగుల అవస్థలు
- పట్టించుకోని కూటమి నేతలు



వెలవెలబోయిన ఆరోగ్యశ్రీ కౌంటర్

తిరుపతి తుడా: ఆరోగ్యశ్రీకి ముసలం పట్టుకుంది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. వైద్యం అందక పేద రోగులు అల్లాడిపోతున్నారు.

తిరుపతి జిల్లాలో 38 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలందిస్తున్నారు. పేరుకుపోయిన బకాయిలు ఏప్రిల్ 6వ తేదీలోపు చెల్లించాలని ఆయా ఆస్పత్రుల నిర్వాహకులు అల్టిమేటం జారీ చేశారు. కానీ కూటమి నేతలు పట్టించుకోలేదు. దీంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ముందస్తుగా ప్రకటించిన మేరకు సోమవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసింది. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కౌంటర్లు వెలవెలబోతున్నాయి. వైద్యం కోసం వచ్చిన పేద రోగులు వెనుదిరుగుతున్నారు.

బకాయిలు విడుదల చేస్తేనే

జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు గత 12 నెలలుగా రూ.220 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లిస్తేగానీ ఆరోగ్యశ్రీని కొనసాగించలేమని ఆస్పత్రుల నిర్వాహకులు తేల్చిచెప్పారు. రూ.10 కోట్లు రావాల్సిన ఆస్పత్రులకు రూ.50 లక్షలు విడుదల చేస్తే ఎలా నడపాలని ఆవేదన చెందుతున్నారు.

అయోమయంలో రోగులు

ప్రభుత్వం దిగివచ్చి బకాయిలు చెల్లించని పక్షంలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పూర్తిగా పేదలకు దూరంకానున్నాయి. ఇప్పటికే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో రోగులు అడ్మిషన్లు తీసుకుని ఉన్నారు. మరికొందరు శస్త్ర చికిత్సలు చేసుకుని వైద్యసేవలు పొందుతున్నారు. ఇంకొందరు ఆరోగ్యశ్రీ అనుమతుల కోసం బెడ్‌లపై నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు ఉన్నపళంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో పేద రోగుల పరిస్థితి అయోమయంలో పడింది. వెంటనే బకాయిలు చెల్లించి పేద రోగులకు ఆరోగ్యశ్రీ భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరోగ్యశ్రీ మాటెత్తితే మండిపడుతున్నారు



మాది రేణిగుంట. నేను తిరుపతి నగరంలోని ఓ చెప్పుల షాపులో కూలీగా పనిచేస్తున్నాను. నాకు రెండుకాళ్లు వాచిపోయాయి. కిడ్నీలు దెబ్బతిన్నాయనే అనుమానం ఉంది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి సోమవారం వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు చూపించా. అక్కడున్న సిబ్బంది దయచేసి వెళ్లిపోండి అని చెప్పారు. నేను నా భార్య బతిమలాడినా వినిపించుకోలేదు. చేసేది లేక ఇంటికి వచ్చేశాం.

–రమణాచారి, మంగళం, తిరుపతి



క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న మోటార్‌బైక్


మృతిచెందిన పుల్లయ్య

- వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్: ఇసుక ట్రాక్టర్‌ను మోటారు బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. అయ్యప్పరెడ్డిపాళెం మిక్సిడ్ కాలనీకి చెందిన పులయ్య(26) ఆదివారం రాత్రి మోటారు బైక్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యంలోని తుమ్మూరు వద్ద ఇసుక లోడ్డుతో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా మలుపు తిరగడంతో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొనింది. తీవ్రంగా గాయపడిన పుల్లయ్య గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఈగా సునీత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన కోటేశ్వరరావు

రాపూరు: మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన రాపూరు- మద్దెల మడుగు మధ్యలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. రాపూరుకి చెందిన బొజ్జా కోటేశ్వరరావు (35) మద్దెల మడుగు నుంచి రాపూరుకు ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఈ క్రమంలో మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కోటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

తవ్వుకో.. తరలించుకో!

- గూడూరు నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- ప్రజాప్రతినిధి అండతో చెలరేగిపోతున్న కూటమి నేతలు
- ఎలాంటి అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్
- భయాందోళనలో తుంగపాళెం వాసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు రూరల్ పరిధి, చెన్నూరు రెవెన్యూలో అనుమతులు లేని ఓ మైనింగ్ కంపెనీని అడ్డుపెట్టుకుని కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. తుంగపాళెం ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి సదరు మైనింగ్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ఆరు నుంచి ఎనిమిది టిప్పర్ల క్వార్ట్జ్ ఖనిజాన్ని చెన్నై ప్రాంతానికి తరలిస్తున్నారు.

మైన్‌లోకి బయట నుంచి ఖనిజం

అనుమతులు లేని మైన్‌లోకి ప్రభుత్వ భూముల్లో తవ్విన క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలించి అక్కడ వాటిని గ్రేడింగ్ చేసి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ అక్రమంగా మైనింగ్ జరగడానికి స్థానిక ప్రజాప్రతినిధి అండగా ఉండగా చెన్నూరు ప్రాంతానికి చెందిన ఓ కూటమి నాయకుడు కనుసన్నల్లోనే ఈ తతంగం కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

తుంగపాళెం సమీపంలోని మైనింగ్ కంపెనీలో అక్రమంగా తవ్వకాలు చేసి క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మైనింగ్ కంపెనీలో భాగస్వామి ఒకరు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనకు ఫిర్యాదు చేశారు. తనకు మైనింగ్ విషయం తెలియకుండానే అక్రమంగా తవ్వకాలు, తరలింపు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

బ్లాస్టింగ్‌కు అనుమతులు ఎక్కడవి?.

గనుల శాఖలో బ్లాస్టింగ్ చేయాలంటే పలు రకాల అనుమతులు అవసరం. అయితే తుంగపాళెం వద్ద అసలు ఎలాంటి అనుమతులు లేని మైనింగ్‌లో రాత్రి పూట బ్లాస్టింగ్ చేస్తున్నారు. దీనిద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాత్రిపూట నిద్రలేక అగచాట్లు పడుతున్నారు.


ప్రభుత్వ భూమిలో వెలికి తీసిన మైకా క్వార్ట్జ్ ఖనిజం

రాత్రి బ్లాసింగ్.. పగలు రైట్‌రైట్

చెన్నూరు బిట్-2లోని తుంగపాళెం సమీపంలో ప్రభుత్వ, మేత పోరంబోకు భూములున్నాయి. వీటిలో విలువైన క్వార్ట్జ్ ఖనిజం ఉంది. దీనిపై కూటమి నేతలు దృష్టి పెట్టారు. అనుమతులు లేని మైనింగ్ నిర్వాహకులతో కుమ్మక్కై, రాత్రిపూట బ్లాస్టింగ్ చేసి.. పగటి పూట మెటీరియల్‌ను తరలిస్తున్నారు. అక్కడి నుంచి ముడిసరుకును నేరుగా టిప్పర్లలో చెన్నైకి చేరవేస్తున్నారు.


క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్లు

మెటీరియల్‌కు అనుమతులు ఉన్నాయి

తుంగపాళెం సమీపంలో ఉన్న మైన్‌కు అనుమతులు అయితే లేవు గానీ, అందులో మూత వేసే సమయంలో ఉన్న ఖనిజాన్ని బయటకు తరలించుకునేందుకు అనుమతులు కావాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈ మేరకు వాటిని పరిశీలించి ఉన్న ఖనిజాన్ని తరలించే వరకు అనుమతులు మంజూరు చేసి ఉన్నారు. బయట నుంచి ఖనిజాన్ని తరలించే విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, గనులశాఖాధికారి, గూడూరు

అట్టహాసంగా తిరుపతి రూరల్ ఎంపీపీ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డిని సత్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీపీ బాధ్యతల స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. గత నెల 27న జరిగిన ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి మూలం చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధించిన విషయం విధితమే. ఈమేరకు ఆయన తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో సోమవారం బాధ్యతలను స్వీకరించారు. తర్వాత ఎంపీపీని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. తదనంతరం ఎంపీపీ దంపతులు మోహిత్ రెడ్డిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, యశోదతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని సత్కరించారు. అలాగే ఎంపీడీవో రామచంద్రతో పాటు కార్యాలయ సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు.

ఫ్లెక్సీలపై అధికారుల ఓవరాక్షన్

తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన మూలం చంద్రమోహన్‌రెడ్డికి పలువురు ఎంపీటీసీలు, పార్టీ నేతలు, శ్రేయోభిలాషులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే వీటి ఏర్పాటు విషయంలో పంచాయతీ అధికారులు ఓవరాక్షన్ చేసి వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. దీన్ని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఆపై ప్రమాణస్వీకర మహోత్సవం పూర్తవగానే ఫ్లెక్సీలను తొలగించారు.

అక్రమ అరెస్ట్‌లకు భయపడం

- కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే ఉంటాం
- ఆగ్రహం వ్యక్తం చేసిన అభినయ్


మీడియాతో మాట్లాడుతున్న భూమన అభినయ్

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం చేయించే అక్రమ అరెస్ట్‌లు, కేసులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం కూటమి అరాచక పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలపై ఉందన్నారు. అయితే కూటమి ప్రభుత్వానికి కొమ్ముగాసే ఎల్లో మీడియా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి వారికి భయాన్ని పరిచయం చేయండి అన్నట్లుగా ఆ పత్రిక రాసిన కథనాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉచిత బస్సు, విద్యుత్ చార్జీల పెంపు వంటి వాటిపై వినూత్న నిరసనలతో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్‌లకు పాల్పడడం సరికాదన్నారు. ఆరేళ్ల క్రితం ప్రత్యేక హోదా కోసం సహకరించని అప్పటి హోం మంత్రి అమిత్‌షా తిరుమలకు విచ్చేసినప్పుడు ఆయన కాన్వాయ్‌పై టీడీపీ నాయకులు చెప్పులు విసిరి నిరసన తెలిపారన్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే అప్పుడు లేని అక్రమ కేసులు, అరెస్ట్‌లు ఇప్పుడు తమపై ఎందుకు పెట్టమని పదేపదే రాస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా, రెడ్‌బుక్‌లో పేర్లను అండర్‌లైన్ చేసినా తాము అదరం, బెదరమన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటామని తెలిపారు. చేతనైతే ఏమి చేసుకుంటారో చేసుకోండంటూ సవాల్ విసిరారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో తృతీయ స్థానం


తృతీయ స్థానం సాధించి ట్రోఫీని అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు


తృతీయ స్థానం సాధించి ట్రోఫీని అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : పిడుగురాళ్లలో ఈ నెల 5, 6 తేదీల్లో అండర్-19బాలబాలికల రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి జిల్లా నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయి. ఈ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు తృతీయ స్థానంలో నిలిచి ట్రోఫీ, మెడల్స్‌ను అందుకున్నాయి. బాలికల విభాగంలో బెస్ట్ బ్యాట్స్ ఉమన్‌గా ఎ.రేష్మ, బాలుర విభాగంలో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా పోలరాజ్, నరసింహలు ప్రశంలందుకున్నారు. ప్రతిభ చాటిన బాలబాలికల జట్లను జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎ.దేవరాజ్, కార్యదర్శి బి.మనోహర్, కోచ్ హరినాథ్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు లక్నోలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.

అరవపాళెం పాఠశాలకు మౌలిక వసతులు


భవనాన్ని ప్రారంభిస్తున్న రవి సన్నారెడ్డి, ఇవామి, తవేగనా

చిట్టమూరు: మండలంలోని అరవపాళెం జెడ్పీ హైస్కూల్‌కు ప్రయివేటు పాఠశాలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తామని శ్రీ సిటీ ఎండీ రవిసన్నారెడ్డి స్పష్టం చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో పాఠశాల ఆవరణలో జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ లిమిటెడ్ కంపెనీ ఎండీ టైజో ఇవామితమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.29.5 లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని శ్రీసిటీ ఎండీతో పాటు, టైజోఇవామితో కలసి సోమవారం ప్రారంభించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రవిసన్నారెడ్డి మాట్లాడుతూ తాను అరవపాళెం గ్రామంలో జన్మించి ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు చదివానని గుర్తుచేసుకున్నారు. అనంతరం బీటెక్ పూర్తి చేసి అమెరికాకు వెళ్లి అక్కడ ఉన్నత విద్య అభ్యసించి తడలో శ్రీసిటీని ప్రాంభించినట్లు తెలిపారు. శ్రీసిటీలోని ఐమాస్ కంపెనీ సామాజిక సేవలో భాగంగా తాను చదువుకున్న పాఠశాలకు అదనపు భవనం కావాలని కోరగా వెంటనే ఎండీ టైజో ఇవామి స్పందించి భవన నిర్మానానికి సహకరించారన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పది పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.లక్ష, జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థికి రూ.50వేలు, మండల స్థాయిలో రాణించిన వారికి రూ.10 వేలు నగదు బహుమతులు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఈఈ బీవీ కృష్ణయ్య, హెచ్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అమ్మేస్తున్న తిరుపతి రూరల్ తహసీల్దార్

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు
- ఆధారాలతో సమర్పించిన ప్రజాప్రతినిధులు
- విచారణకు జేసీని ఆదేశించిన కలెక్టర్


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములను అక్రమార్కుల చేతుల్లోకి చేర్చి అవినీతికి పాల్పడుతున్న తిరుపతి రూరల్ తహసీల్దారు రామాంజులు నాయక్‌పై విచారణ జరిపించాలని తిరుపతి రూరల్ మండల ప్రజాప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ఎంపీపీలు మాదవరెడ్డి, యశోద, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మలతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. తిరుపతి రూరల్ మండలం తహసీల్దారు రామాంజులు నాయక్ అండగా నిలబడడంతో తరతరాలుగా కాపాడుకుంటూ వచ్చిన భూములన్నీ అక్రమార్కుల పరం అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుపతి రూరల్ తహసీల్దారుగా రామాంజుల నాయక్ వచ్చినప్పటి నుంచి ఆక్రమణదారుల చెంతకు చేరిన ప్రభుత్వ భూములు, మఠం, భూములు, ఇనాం భూములు, కాలువ భూములు, చెరువు భూముల వివరాలను ఆధారాలతో సహా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఎవైనా తహసీల్దార్‌కు సమాచారం ఇస్తే వారి వివరాలను క్షణాల్లో ఆక్రమణదారులకు అందుతున్నాయంటే ఆయన ఏరకంగా వారితో ఆక్రమణదారులతో లాలూచీ పడ్డారో అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల దురాక్రమణలపై పత్రికల్లో ప్రచురించిన కథనాలు ప్రతులను కూడా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. భూ ఆక్రమణదారులతో బేరం పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్టు సాక్ష్యాలు కూడా ఆధారాలు కూడా వున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి తహసీల్దారుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజలందరితో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరాహార దీక్షలు చేపట్టడానికి సిద్ధంగా వున్నట్టు తెలిపారు. పది రోజుల సమయం తరువాత ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ పూర్తిస్థాయి విచారణకు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆదేశిస్తున్నట్టు తెలిపారన్నారు. విచారణ తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు.

భగ్గుమన్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు


లక్ష్మీపురం సర్కిల్ నుంచి ర్యాలీగా వెళుతున్న సీఐటీయూ నేతలు

తిరుపతి రూరల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు భగ్గుమన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్‌లో కాంట్రాక్టర్లనే కాదు కాంట్రాక్టు కార్మికులను కూడా పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఉద్యోగం చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరుతూ తిరుపతి నగరంలో మహా ధర్నా చేపట్టారు. సోమవారం ఉదయం లక్ష్మీపురం సర్కిల్ నుంచి కేశవాయనగుంట ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి పలువురు నాయకులు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పి4 సర్వే పేరిట పేదల బతుకుల్ని పెద్దల దయాదాక్షిణ్యానికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో ఆదాయం రూ.16 వేల కోట్లు ఉండగా కష్టపడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కోసం ఒకటిన్నర శాతం కూడా ఖర్చు చేయడం లేదన్నారు.

చర్చలకు సానుకూల స్పందన

డిస్కం పరిధిలోని అధికారులు కాంట్రాక్ట్ కార్మికులకు అండగా నిలిచారు. తాము చేయగలిగిన పరిష్కారాలను చేయడానికి అభ్యంతరం లేదని సీజీఎం హెచ్‌ఆర్డీ రమణదేవి, డీజీఎంలు మూర్తి, సురేంద్రబాబు, వెంకటరత్నం హామీ ఇచ్చారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులతో చర్చించి వినతి పత్రాలు స్వీకరించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి)గా అరుణ సారిక నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా మచిలీపట్నంలో పనిచేస్తున్న అరుణ సారికను చిత్తూరు జిల్లా జడ్జిగా బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న ఇ.భీమారావును అనంతపురం జిల్లా జడ్జిగా నియమించింది. చిత్తూరులోని పోక్సో కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎస్.శాంతిని కడప ఫ్యామిలీ కోర్టుకు, 6వ అదనపు జిల్లా జడ్జి బి.బాబూనాయక్‌ను మచిలీపట్నం ఎస్సీ-ఎస్టీ కోర్టుకు, రాజమహేంద్రవరంలో పనిచేస్తున్న ఆర్.శ్రీలతను మదనపల్లె 7వ జిల్లా సెషన్స్ జడ్జిగా, రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి పీవీఎస్.సూర్యనారాయణ మూర్తిని మదనపల్లె 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా, ఇక్కడ పనిచేస్తున్న బండెల అబ్రహాంను విజయవాడ 7వ అదనపు, జిల్లా సెషన్స్ జడ్జిగా, తూర్పుగోదావరి రామచంద్రాపురంలో పనిచేస్తున్న ఎం.శంకర్‌రావును చిత్తూరు పోక్సో కోర్టు జడ్జిగా బదిలీ చేసింది. అలాగే గూడూరు 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న షమి పర్వీన్ సుల్తానా బేగంను గుంటూరు పోక్సో కోర్టుకు, నెల్లూరులో ఫ్యామిలీ కోర్టులో పనిచేస్తున్న కె.వెంకటనాగపవన్‌ను గూడూరు 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా బదిలీ చేసింది.

ప్చ్..కాపాడలేకపోయారు!


మృతశిశువు


మనవడ్ని కోల్పోయిన నాగమణి

శ్రీకాళహస్తి: పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి సపర్యలు చేశారు. అన్ని పరీక్షలు నిర్వహించారు. తల్లి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో రెఫర్ చేయలేక స్థానికంగానే డెలివరీ చేశారు. కానీ బిడ్డ ప్రాణాలు మాత్రం కాపాడలేకపోయారు. ఈ ఘటన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం.. బుచ్చినాయుడుకండ్రిగ మండలం, చెన్నాయగుంటకు చెందిన అభినయ, అంకయ్య దంపతులు. అభినయ నిండు గర్భిణి కావడం.. పురిటి నొప్పులు రావడంతో ఆదివారం ఉదయం 7.50 గంటలకు ఆమె తల్లి నాగమణి కుమార్తెను తీసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి చేరింది. విధుల్లో ఉన్న నర్సులు స్కానింగ్ తదితర వంటివి పూర్తి చేశారు. బిడ్డకు రెండు పేగులు చుట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. మధ్యాహ్నం వరకు అభినయకు నొప్పులు సరిగా రాకపోవడం.. అప్పటి వరకు విధుల్లో ఉన్న నర్సులు డ్యూటీ దిగిపోవడంతో తర్వాత వచ్చినవారు క్రిటికల్‌గా ఉందని చెప్పి వెళ్లిపోయారు. డాక్టర్ సతీష్, కొంతమంది పీజీ డాక్టర్లు గైనకాలజిస్టు లేకనే డెలివరీ చేయడానికి ప్రయత్నించారు. సాయంత్రం 3గంటల ప్రాంతంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మికి ఫోన్ చేసి బయటకు తీసుకెళ్లడం మంచిది కాదని చెప్పడంతో అక్కడే డెలివరీ చేశారు.

ఉలుకూ పలుకూ లేని బిడ్డ

బిడ్డ పుట్టగానే ఉలుకూ పలుకు లేకపోవడంతో వెంటనే తిరుపతికి తీసుకెళ్లాలని అక్కడి డాక్టర్లు సూచించారు. 108 రావడానికి రెండు గంటలు పడుతుందని చెప్పడంతో బంధువులు వెంటనే ఓ ప్రైవేటు అంబులెన్స్‌కు రూ.6,500 చెల్లించి తిరుపతి రుయాకు తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే బిడ్డ మృతిచెందినట్టు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మూడు రోజులుగా లేని 108 డ్రైవర్లు

ఏరియా ఆస్పత్రిలో మూడు రోజులుగా 108 అంబులెన్స్‌లకు డ్రైవర్లు లేరు. దీంతో సకాలంలో వైద్యం అందక పేద రోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ శుక్రవారములలో

MSW
9900945071

WALK-IN-INTERVIEW
Office Assistant (Female)
Qua: Any Degree
Attender (Male)
Qua: 10th/ Intermediate
Office timing: 10am to 6 pm
ALL INDIA INSTITUTE OF LOCAL SELF GOVERNMENT
9-12-1/3, Kesavayanagunta,
Above Sapthagiri Grameena bank, Tirupati,
Cell: 93912 19991

WALK-IN-INTERVIEW
ON 12.04.2025 (SATURDAY) Bet. 10AM TO 2PM
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, పీలేరు, చంద్రగిరి, రేణిగుంట, నగరి బ్రాంచ్‌ల నందు పనిచేయుటకు క్రింది సిబ్బంది కావలెను.
FIELD EXECUTIVES
RECOVERY EXECUTIVES
TELE CALLER (FEMALE)
డిగ్రీ/ MBA కలిగి 28 సం॥లలోపు వయస్సు గల యువకులు సర్టిఫికెట్లు, బయోడేటా, దిగువ తెలిపిన చిరునామాకు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. జీతం: రూ.15,000/- + ఇన్సెంటివ్స్(10,000/- వరకు) లు ఇవ్వబడును. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. టూవీలర్ కలిగి వుండవలెను.
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
సెల్: 9676337863, 8074678803

సాక్షి క్లాసిఫైడ్స్

Education
COMPUTER EDUCATION
■ ఫ్రీ కోర్సులు. DCA, DTP, MS-Office (Lab Fee Only), Paid కోర్సులు:DCA,PGDCA, DTP, Tally,MS-Office,స్పోకెన్ ఇంగ్లీష్ etc. SSCT, 663, భవాని నగర్, తిరుపతి, 9440706077.

Real Estate
BUILDING FOR SALE
■ No Broker - Direct Owner Sale Newly Constructed Commercial Building for Sale (22x46)- Nimmanapalli 150 Meters from Bus Stand, ✆ 94911 63945.

LAND REQUIRED
■ తిరుపతి పరిసర ప్రాంతాలలో North East ఫేసింగ్ ... 8885559435.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

PERSONAL CARE

CHANGE OF NAME
■ I Duddu Nirmala Devi (Old Name) W/o Late Adharam Ramachandraiah, residing at D.No.10-12-394, Doddapuram, Tirupathi, A.P. I have changed my name to Adharam Nirmala Ram (New Name) Hence forth, I will be known as Adharam Nirmala Ram.

Wanted
■ తిరుపతిలో తనపల్లి సమీపంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం:16,000+PF,ESI. సంప్రదించండి సెల్: 9347107832, 8125223207.
■ SBI నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ కావలెను. (Bank లోపల కూర్చొని చేసే ఉద్యోగం) Any Degree, M/F, A:32yrs, 9949942245, 9121905906.
■ జాయ్ ఫిల్టర్ కాఫీ పొడి షాపు లో పనిచేయుటకు లేడీస్ కావలెను. Q:10th+,షాపునెం.5, డో.నెం.18-3-61/1ఎ,భాదీకాలనీ మెయిన్ రోడ్, జగన్నాథమ్మాలు ప్రక్కన,తిరుపతి.7416732247.
■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 85504 87459.
■ హోటల్ రమణ విలాస్, రేణిగుంట నందు పనిచేయుటకు క్యాషియర్, టీ మాస్టర్, వెయిటర్స్, దోస మాస్టర్, సెక్యూరిటీ కావలెను. ✆ 8522071377.
■ నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో పని చేయుటకు అసిస్టెంట్-ఫైర్ & సేఫ్టీ Qlf:డిప్లొమా (ఫైర్ & సేఫ్టీ), సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్, ఎత్తు 5'8(పురుషులు), 5'4(స్త్రీలు),హౌస్‌కీపింగ్/ క్లీనింగ్ హెల్పర్స్ కావలెను. మంచి జీతం. PF,ESI,గ్రాట్యుటీ వార్షిక బోనస్ ఇవ్వబడును. దూర ప్రాంత అభ్యర్థులకు బ్యాచిలర్ వసతి భోజనం కలదు.సంప్ర:7794999984,7997788000.
■ రామూస్ ఏజన్సీస్ (పూజా స్టోర్) నందు పని చేయుటకు స్టోర్ ఇన్‌చార్జ్ (లేడీస్) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్(జెంట్స్ / లేడీస్) కావలెను.ఆంజనేయస్వామిగుడివీధి, వెంకటగిరి. సెల్:9849997918, 8977782314.
■ కష్టపడేవాళ్లు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 7995365999
■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు శ్రీసిటీ, నాయుడుపేటలో డ్యూటీచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ ASO అర్జెంటుగా కావలెను. Qualification: 10th. సంప్ర:99089 54793, 97019 99159.

గమనిక